

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక


సంపుటి : 6 | సంచిక : 281 | పేజీలు : 8 | వెల : రూ.2/- | బుధవారం 04 నవంబర్ 2026 | వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

సుపరిపాలనే మా విజయ మంత్రం..

ప్రజా తీర్పే నిదర్శనం

● సుపరిపాలనకు మెచ్చి ప్రజలిచ్చిన తీర్పు ● 'గుడ్ పాలిటిక్స్.. గుడ్ గవర్నెన్స్' మా విధానం ● ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం.. రూ.36 వేల కోట్లతో 36 ప్రాధాన్య ప్రాజెక్టులు ● వారసత్వంగా వచ్చిన సమస్యలు ఇంకా ఉన్నాయి.. తుఫాన్లపైనా అపహాస్యం తగదు: సీఎం చంద్రబాబు



అమరావతి,మన జనప్రగతి నవంబర్ 03: పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన ఫలితాలు తమ ప్రభుత్వం అందిస్తున్న సుపరి పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పునకు నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 'గుడ్ పాలిటిక్స్.. గుడ్ గవర్నెన్స్' అనేదే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. రాజకీయాల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికే తాను అధిక ప్రాధాన్యత ఇస్తున్నానని తెలిపారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కార్యాలయంలో అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిరంతరం పనిచేస్తున్నామని, ప్రభుత్వ పనితీరును గుర్తించే కార్పొరేషన్లు, మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమికి మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ప్రజలు తమ ప్రభుత్వానికి ఇదే విధంగా మిగతా2లో...



ఏపీలో కూటమికే

పట్టం!

● పట్టణ స్థానిక సంస్థల్లో ఆధిక్యం!

● కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టీడీపీ కూటమి హవా

● జగన్ సొంత జిల్లా కడపలోనూ కూటమి ఆధిపత్యం

● నందికొట్కూరులో వైసీపీ విజయం.. అనంతపురంలో బీజేపీకి ఎదురుదెబ్బ

అమరావతి,మన జనప్రగతి నవంబర్ 03: ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో అధికార టీడీపీ నేతృత్వంలోని కూటమి ఆధిక్యం ప్రదర్శించింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో ముందంజలో నిలిచారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు పలు ప్రాంతాల్లో ఆధిక్యం కనబరిచారు. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా కడపతో పాటు ఆయన సొంత నియోజకవర్గం పులివెందులలోనూ టీడీపీ కూటమి అభ్యర్థులు పైచేయి సాధించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. **కార్పొరేషన్లలో కూటమి ఆధిక్యం** రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపులో కూటమి అభ్యర్థులు మిగతా2లో...

కూటమి విజయంపై

పవన్ ధీమా!

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు పాలనకు మద్దతు పలికారు

జనసేన, టీడీపీ, బీజేపీకి అండగా నిలిచిన ఓటర్లకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు



అమరావతి,మన జనప్రగతి నవంబర్ 03: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ పాలనపై పట్టణ, నగర ప్రజలు విశ్వాసం చూపించారని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఈవీఎం అయినా.. బ్యాలెట్ అయినా విజయం కూటమిదేనని పేర్కొన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీకి అండగా నిలిచిన ఓటర్లకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నగరపాలక సంస్థలు, పురపాలక మిగతా2లో...



ఎన్నికలు కాదు.. ఎంపికలు: జగన్ విమర్శలు

టీమ్ సీబీఎన్‌కు అభినందనలు అంటూ చంద్రబాబు, పోలీస్ యంత్రాంగం, ఎన్నికల సంఘంపై వ్యంగ్యాస్త్రాలు

అమరావతి,మన జనప్రగతి నవంబర్ 03: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయంపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యంగ్యంగా స్పందించారు. 'టీమ్ సీబీఎన్‌కు కంగ్రాట్స్' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, పోలీసు మిగతా2లో...

ప్రజా తీర్పు.. మరింత

బాధ్యత: లోకేశ్

కూటమి విజయంపై ప్రజలకు కృతజ్ఞతలు

సంబరాల కంటే ప్రజాసేవకే ప్రాధాన్యం ఇవ్వాలని విజేతలకు సూచన



మున్సిపల్ ఫలితాలు ప్రజా విశ్వాసానికి

నిదర్శనం

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పెరిగింది: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



అమరావతి,మన జనప్రగతి నవంబర్ 03: ఆంధ్రప్రదేశ్‌లో వెలువడిన మున్సిపల్, నగరపాలక సంస్థల ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కడుతూ కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల్లో కూటమి సాధించిన విజయాలు ప్రభుత్వ పనితీరుకు ప్రజల మద్దతుగా భావిస్తున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు మిగతా2లో...

కడప కోటలో

కూటమి జెండా!

జగన్ సొంత జిల్లాలో వైసీపీకి ఎదురుదెబ్బ.. పులివెందులలోనూ టీడీపీ విజయం

కడప కార్పొరేషన్‌తో పాటు ఎనిమిది మున్సిపాలిటీల్లో కూటమి ఆధిక్యం.. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత కడప మున్సిపల్ పీఠంపై టీడీపీ పాగా



కడప, మన జనప్రగతి నవంబర్ 03: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా కడపలో జరిగిన పురపాలక ఎన్నికల ఫలితాలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. జిల్లాలోని పట్టణ స్థానిక సంస్థలన్నింటిలోనూ టీడీపీ నేతృత్వంలోని కూటమి ఆధిక్యం మిగతా2లో...

మురసు తుఫాన్ బీభత్సం!

ఏపీ అంతటా భారీ వర్షాలు!

పొన్నూరులో అత్యధికంగా 31.2 సెం.మీ. వర్షపాతం నమోదు

గుంటూరులో 30 సెం.మీ. వర్షం.. పలు ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తం



మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

04 - 11 - 2026

సుపరిపాలనే మా విజయ మంత్రం.. ప్రజా తీర్పే నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి)

సహకరించాలని కోరారు.**రూ.36 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు** రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేసేందుకు రూ.36 వేల కోట్ల వ్యయంతో 36 ప్రాధాన్య ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు తొలిదశ పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వెలిగొండ ప్రాజెక్టును తానే ప్రారంభించానని గుర్తుచేశారు. అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని, గతంలో ధ్వంసమైన రహదారులను తిరిగి నిర్మించామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని సమస్యలూ పరిష్కారమయ్యాయని తాము చెప్పడం లేదని, గత పాలన నుంచి వారసత్వంగా వచ్చిన సమస్యలు ఇంకా ఉన్నాయని అంగీకరించారు.**ప్రజా సేవల్లో లోపాలుంటే సరిదిద్దుకుంటాం** ప్రభుత్వ సేవలు అందించే విషయంలో ఎక్కడైనా పొరపాట్లు జరిగితే వాటిని గుర్తించి సరిదిద్దుకుంటామని సీఎం తెలిపారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించడమే తమ లక్ష్యమన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నవారు, వివిధ రాజకీయ పార్టీలకు మద్దతు ఇచ్చేవారు ఉంటారని, ఎన్నికల సమయంలో భిన్నాభిప్రాయాలు సహజమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ రాజకీయ పార్టీగా వ్యవహరిస్తోందా? అని చంద్రబాబు ప్రశ్నించారు.**తుఫాన్లపై వెటకారం తగదు** తుఫాన్ల ప్రభావాన్ని కూడా కొందరు రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం సరికాదని చంద్రబాబు అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తే.. కాకినాడకు చెందిన ఓ నాయకుడు 'ఇంకా రాదేమిరా తుఫాను' అంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారని విమర్శించారు. ఆ పోస్టు చేసిన మూడు గంటల్లోనే భారీ వర్షాల ప్రభావం కనిపించిందని పేర్కొన్నారు. తుఫాను ప్రభావంపై అంచనాల్లో కొన్నిసార్లు మార్పులు ఉంటాయని, వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్దుకుం టున్నామని తెలిపారు.**ప్రజల కోసమే నిరంతర సమీక్షలు** గత ఐదు రోజులుగా తుఫాను పరిస్థితులపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నామని సీఎం వెల్లడించారు. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు అధికారులతో సమీక్షించినట్లు, మంగళవారం తెల్లవారుజామున మరోసారి పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిగా ప్రజా సమస్యలపై నిరంతరం అప్రమత్తంగా ఉండటం తన బాధ్యతని పేర్కొన్నారు. ప్రజల భద్రత, సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు.

ఏపీలో కూటమికే పట్టం!

(మొదటి పేజీ తరువాయి)

ఆధిక్యంలో కొనసాగారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, కడప, మచిలీపట్నం తదితర కార్పొరేషన్లలో కూటమి అభ్యర్థులు ముందంజలో నిలిచారు. విశాఖపట్నం మేయర్ అభ్యర్థిగా టీడీపీ తరఫున బరిలో ఉన్న ముక్కా శ్రావణి ఆధిక్యం సాధించారు. గుంటూరు, తిరుపతి, చిత్తూరు, మచిలీపట్నం కార్పొరేషన్లలోనూ టీడీపీ అభ్యర్థులు విజయం సాధించినట్లు ఫలితాలు వెల్లడయ్యాయి. **పులివెందుల లో టీడీపీకి ఆధిక్యం** మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందుల మున్సిపాలిటీలో టీడీపీ కూటమి ఆధిక్యం సాధించడం ఎన్నికల ఫలితాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కడప జిల్లాలోని పలు పట్టణ స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులు విజయాలు నమోదు చేశారు. అయితే నంద్యాల జిల్లా నందికొట్కూరు మున్సిపాలిటీలో వైసీపీ విజయం సాధించింది. కొన్ని ప్రాంతాల్లో స్వతంత్ర అభ్యర్థులు కూడా గెలుపొందారు. **మున్సిపాలిటీల్లోనూ కూటమి హవా** రాష్ట్రంలోని 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో జరిగిన ఎన్నికల లెక్కింపులోనూ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు ఆధిక్యం ప్రదర్శించారు. టీడీపీ అత్యధిక స్థానాల్లో గెలుపొందగా, జనసేన, బీజేపీ అభ్యర్థులు కూడా పలు పట్టణాల్లో విజయాలు సాధించారు. వైసీపీ కొన్ని ప్రాంతాల్లో మాత్రమే గెలుపొందింది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోని పులివెందుల, ప్రొద్దుటూరు, పుంగనూరు వంటి పట్టణాల్లో కూటమి అభ్యర్థుల విజయాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. **వామపక్షాలకూ కొన్ని స్థానాలు** మరోవైపు వామపక్ష పార్టీలు కూడా కొన్ని ప్రాంతాల్లో తమ ఉనికిని చాటుకున్నాయి. గత ఎన్నికల్లో విశాఖపట్నం, విజయవాడ కార్పొరేషన్లలో గెలుచుకున్న ఒక్కో కార్పొరేటర్ స్థానాన్ని సీపీఐ(ఎం) నిలబెట్టుకుంది. మరికొన్ని మున్సిపాలిటీల్లో వార్డు సభ్యుల స్థానాలను సాధించింది.మొత్తంగా పట్టణ ప్రాంతాల్లో జరిగిన ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తించాయి. అధికార కూటమి, ప్రధాన ప్రతి పక్ష వైసీపీ మధ్య జరిగిన పోటీలో పలు కీలక ప్రాంతా ల్లో కూటమి ఆధిక్యం సాధించింది. మిగిలిన స్థానాల లెక్కింపు, తుది ఫలితాలతో పూర్తి రాజకీయ చిత్రం స్పష్టమైంది.

మురసు తుఫాన్ బీభత్సం!

అమరావతి,మన జనప్రగతి నవంబర్ 03:మురసు తుఫాన్ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ తీరం దాటినప్పటికీ దాని ప్రభావం కొనసాగుతోంది. పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలతో పాటు బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతుండగా, సాధారణ జనజీవనానికి అంతరాయం ఏర్పడుతోంది. **పొన్నూరులో అత్యధిక వర్షపాతం** వాతావరణ శాఖ అధికారుల వివరాల ప్రకారం గుంటూరు జిల్లా పొన్నూరులో అత్యధికంగా 31.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుంటూరులో 30 సెంటీమీటర్లు, సత్తెనపల్లిలో 17.9, తెనాలిలో 17.1, బాపట్లలో 15.7, నరసరావుపేటలో 14.5, ఏలూరులో 14.1, చీరాలలో 13.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తుఫాన్ ప్రభావంతో మరికొన్ని ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. **ఓట్ల లెక్కింపునకు వర్షం ఆటంకం**మరోవైపు రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతున్నప్పటికీ, భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో కౌంటింగ్‌కు అంతరాయం ఏర్పడింది. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పలు చోట్ల ఓట్ల లెక్కింపును వాయిదా వేసే పరిస్థితులు నెలకొన్నాయి.

డబ్బులు జమయ్యాకే చెక్కుల పంపిణీ

● ఖేలో ఇండియా క్రీడాకారులకు ఇబ్బందులు పెట్టొద్దు.. అధికారుల సమన్వయ లోపంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్,మన జనప్రగతి నవంబర్ 03: ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో క్రీడాశాఖ అధికారుల తీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖలో బాధ్యతారాహిత్యం, అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.**నిధుల బదిలీ తర్వాతే చెక్కులు**



ఆర్థిక శాఖ నుంచి స్పోర్ట్స్ అథారిటీకి నిధులు బదిలీ అయిన తర్వాతే క్రీడాకారులకు చెక్కులు పంపిణీ చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఖాతాల్లో డబ్బులు లేకుండానే చెక్కులు ఇచ్చి క్రీడాకారులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని సూచించారు. నిధుల లభ్యతను నిర్ధారించుకున్న తర్వాతే చెక్కుల పంపిణీ చేపట్టాలని ఆదేశించారు.**క్రీడాకారులను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు** క్రీడాకారులు, వారి తల్లిదండ్రులను పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పడం మంచి పద్ధతి కాదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. క్రీడాకారులకు అందాల్సిన ప్రోత్సాహకాలు, ఆర్థిక సహాయం సకాలంలో అందేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచుకుని సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పాత ఓటర్లకు ఈసీ ఊరట

- జాబితాలో పేరు లేకున్నా ఫారం-6తో మళ్లీ నమోదు చేసుకోవచ్చు

న్యూఢిల్లీ, మన జనప్రగతి నవంబర్ 03:ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైన పాత ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం ఊరటనిచ్చింది. గతంలో ఓటరుగా నమోదై ఉండి, ప్రస్తుతం జాబితాలో పేరు కనిపించని వారు తిరిగి ఓటు హక్కు కోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. గతంలో ఓటరుగా ఉన్నప్పటికీ మళ్లీ దరఖాస్తు చేయడం తప్పుడు ప్రకటన కిందకు రాదని తెలిపింది. ఫారం-6లోని 'మొదటిసారి ఓటు నమోదు' అనే ప్రకటనపై పాత ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ కారణంతో వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 31 కింద చర్యలు తీసుకోవద్దని ఎన్నికల నమోదు అధికారులకు సూచించింది.అయితే దరఖాస్తుదారులు



మరో పార్లమెంటరీ లేదా అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటికే ఓటరుగా నమోదై ఉండకూడదని స్పష్టం చేసింది. ఢిల్లీ హైకోర్టులో ఈ అంశంపై జరిగిన విచారణ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మార్గదర్శకాలు జారీ చేసింది.ఈ సూచనలను అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు పంపించింది. స్థానిక భాషల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించింది. దీంతో ముసాయిదా జాబితాలో పేర్లు లేని అర్హులైన పాత ఓటర్లు తిరిగి నమోదు చేసుకునేందుకు అవకాశం కలిగింది.

కూటమి విజయంపై పవన్ ధీమా!

(మొదటి పేజీ తరువాయి)

సంఘాలు, నగర పంచాయతీల్లో కూటమి పక్షాలకు లభిస్తున్న విజయాలను తమ ప్రభుత్వ పాలనకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా భావిస్తున్నామని వెల్లడించారు.**అభివృద్ధి, సంక్షేమానికి ప్రజల మద్దతు** మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై పట్టణ ప్రజలు విశ్వాసం కనబరిచారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ ఈవీఎంలను నిందించిందని, ఇప్పుడు బ్యాలెట్ ద్వారా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు కూటమికి మద్దతు పలికారని వ్యాఖ్యానించారు. ఎన్నికల విధానం ఏదైనా ప్రజల తీర్పు కూటమికి అనుకూలంగా ఉందని అన్నారు.**జనసేనపై నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం** మున్సిపల్ ఎన్నికల్లో జనసేనకు లభించిన మద్దతు ఎంతో విలువైనదని పవన్ కల్యాణ్ తెలిపారు. మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల విజయాలు, అధిక్యాలు పట్టణ ప్రాంతాల్లో పార్టీకి లభిస్తున్న ఆదరణకు నిదర్శనమన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలను అభినందించారు.**రాష్ట్ర అభివృద్ధికి సమష్టి కృషి** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనా అనుభవాన్ని జోడించి ఆంధ్రప్రదేశ్‌ను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో సాధించిన విజయాలను భవిష్యత్తులో జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ పునరావృతం చేస్తామనే విశ్వాసం వ్యక్తం చేశారు.

ఎన్నికలు కాదు.. ఎంపికలు: జగన్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

యంత్రాంగం, రాష్ట్ర ఎన్నికల సంఘంపై విమర్శలు గుప్పించారు.ప్రతిపక్షాలకు పోటీ చేసే అవకాశం లేకుండా చేసి ఎన్నికల్లో ఘన విజయం సాధించారని ఎద్దేవా చేశారు. నామినేషన్ల దశ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియలను హైజాక్ చేశారని, పోలింగ్ ఏజెంట్లను అడ్డుకున్నారని విమర్శించారు. పోలింగ్‌లో రిగ్గింగ్‌కు పాల్పడ్డారని, ఓట్ల శాతాన్ని కూడా తారుమారు చేశారని ఆరోపించారు. **ఎన్నికల సంస్కరణలు అవసరం** ప్రజలు అభ్యర్థులను ఎన్నుకోలేదని, అధికార పక్షమే అభ్యర్థులను ఎంపిక చేసుకుందని జగన్ వ్యాఖ్యానించారు. ఇవి ఎన్నికలు కావని, కేవలం ఎంపికలు మాత్రమేనని విమర్శించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం గతంలో ఎన్నడూ లేనంతగా ఇప్పుడు స్పష్టమైందని తన సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు.

ప్రజా తీర్పు.. మరింత బాధ్యత: లోకేశ్

అమరావతి,మన జనప్రగతి నవంబర్ 03:ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును బాధ్యతగా స్వీకరిస్తున్నామని రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. ఈ విజయాన్ని కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా ప్రజలకు మరింత సేవ చేసేందుకు లభించిన అవకాశంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లుగా కూటమి ప్రభుత్వం అందిస్తున్న పాలనకు ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంగా ఈ తీర్పును భావిస్తున్నామని తెలిపారు.మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులకు లోకేశ్ అభినందనలు తెలిపారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే అసలైన బాధ్యత అని స్పష్టం చేశారు.
పార్టీలకు అతీతంగా ప్రజాసేవ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఇకపై ప్రతి పౌరుడికి పార్టీలకు అతీతంగా సేవలందించడమే తమ లక్ష్యమని లోకేశ్ వెల్లడించారు. ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు అహంకారానికి తావివ్వకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. విజయం సాధించామనే గర్వం కాకుండా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యతను గుర్తుంచుకోవాలని అన్నారు.ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని కాపాడుకునేందుకు గతంలో కంటే మరింత కష్టపడి పనిచేస్తామని లోకేశ్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ప్రజాసేవలో మరింత బాధ్యతతో ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు.

మున్సిపల్ ఫలితాలు ప్రజా విశ్వాసానికి నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా పాలన అందించాల్సిన బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి అభ్యర్థులకు అభినందనలు తెలియజేశారు.**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం** ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మాధవ్ స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు. ఎన్నికల ఫలితాలు ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

కడప కోటలో కూటమి జెండా!

(మొదటి పేజీ తరువాయి)

సాధించింది. వైఎస్ కుటుంబానికి సంప్రదాయ రాజకీయ కంచుకోటగా పేరున్న కడప జిల్లాలో కూటమి అభ్యర్థులు పలు స్థానాలను కైవసం చేసుకోవడం విశేషం. ముఖ్యంగా జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులలోనూ టీడీపీ అభ్యర్థులు విజయం సాధించడంతో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది. **జిల్లాలోని అన్ని పట్టణ స్థానాల్లో కూటమి ఆధిక్యం** కడప జిల్లాలో ఒక కార్పొరేషన్, ఎనిమిది మున్సిపాలిటీలు ఉండగా.. వీటన్నింటిలోనూ కూటమి అభ్యర్థులు ఆధిక్యం ప్రదర్శించారు. రాజంపేట, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, కమలాపురం, ఎర్రగుంట్ల, పులివెందుల, జమ్మలమడుగు మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. వీటిలో రాజంపేట, బద్వేలు, మైదుకూరు, కమలాపురం, ప్రొద్దుటూరు చైర్‌పర్సన్ స్థానాలు టీడీపీకి దక్కగా, ఎర్రగుంట్ల మున్సిపాలిటీ బీజేపీ ఖాతాలో చేరింది. ఎన్నికలు జరిగిన పులివెందుల, జమ్మల మడుగులోనూ టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు.**పులివెందులలో వైఎస్ కుటుంబానికి షాక్** వైఎస్ కుటుంబానికి దశాబ్దాలుగా రాజకీయంగా పట్టున్న పులివెందుల మున్సిపాలిటీలో తొలిసారిగా టీడీపీ పాగా వేసింది. మొత్తం 40 వార్డులున్న ఈ మున్సిపాలిటీలో 20 వార్డులను కూటమి ఏకగ్రీవంగా దక్కించుకుంది. చైర్‌పర్సన్ ఎన్నికలో టీడీపీ అభ్యర్థి తూగుట్ల గీతాకుమారి, వైఎస్ కుటుంబానికి చెందిన ప్రమీలపై విజయం సాధించారు. వైసీపీకి కేవలం మూడు వార్డులే దక్కడం గమనార్హం. దీంతో పులివెందులలో వైఎస్ కుటుంబ ఆధిపత్యానికి గండి పడినట్లయింది.**మూడు దశాబ్దాల తర్వాత కడపలో మార్పు** కడప కార్పొరేషన్ మేయర్ స్థానంలోనూ టీడీపీ అభ్యర్థి ముం దంజలో ఉన్నారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత కడప పట్టణ పాలక సంస్థపై టీడీపీ జెండా ఎగిరే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు పెద్దిరెడ్డి కుటుంబానికి రాజకీయంగా పట్టున్న పుంగనూరులో 36 వార్డుల కుగాను వైసీపీ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయిందని ఆంధ్రజ్యోతి కథనం పేర్కొంది. కడప జిల్లాలో వెలువడిన ఈ ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ విక్రాంత్



కర్నూలు బ్యూరో మన జనప్రగతి నవంబర్ 03:-కర్నూలు నగర శివారులోని అథేనా స్కూల్‌లో ఏర్పాటు చేసిన కర్నూలు నగరపాలక సంస్థ మేయర్, వార్డు సభ్యుల ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తు, ప్రస్తుత పరిస్థితులపై అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగుతున్న తీరుపై సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా,పారదర్శకంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.కర్నూలు ఎస్పీ తో పాటు కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్,కర్నూలు డీఎస్పీ కె.వి.రాఘవేంద్ర, సిఐలు మధుసుధన్ రావు,తేజమూర్తి,విక్రమసింహా,చంద్రబాబు నాయుడు,శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవుల పక్షాన నిలిచేది కమ్యూనిస్టులే

- మద్దికేర జడ్పీటీసీ అభ్యర్థి మహబూబ్బికి మద్దతుగా సీపీఐ విస్తృత ప్రచారం



పత్తికొండ మన జనప్రగతి నవంబర్ 03:- పేదలు, కార్మికులు, శ్రామికుల సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టు పార్టీయేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి. రాజా సాహెబ్ అన్నారు. మద్దికేర జడ్పీటీసీ అభ్యర్థిగా సీపీఐ తరపున పోటీ చేస్తున్న మహబూబ్బి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం మండలంలోని పెరవలి, హంప, మదనంతపురం, బసినేపల్లి, ఎడవల్లి, బొమ్మనపల్లె, అగ్రహారం, కొత్తపల్లె తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా రాజా సాహెబ్ మాట్లాడుతూ ప్రజలు చెల్లించే పన్నుల ద్వారా ప్రభుత్వానికి సమకూరే నిధులు ప్రజల అభివృద్ధికి ఉపయోగపడాలని అన్నారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్య, వైద్య సదుపాయాల కల్పనకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పేర్కొన్నారు. అభివృద్ధి నిధులు పారదర్శకంగా ఖర్చయ్యేలా, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా చూడాలని తెలిపారు.ప్రజా సమస్యలపై గళమెత్తి, ప్రజల హక్కుల కోసం పోరాడే సీపీఐ అభ్యర్థి మహబూబ్బికి ఒక్క అవకాశం కల్పించాలని కోరారు. కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం. నాగరాజు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా నాయకుడు వెంకట్రావు వర్మ, సీపీఐ సీనియర్ నాయకుడు డాక్టర్ వలి సాహెబ్, ప్రజాసంఘాల నాయకులు కోదాడ రాముడు, రామాంజనేయులు, బుజ్జన్న, కిష్టన్న, సత్తార్, లక్ష్మన్న, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ పట్టణంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం

- మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ విస్తృత పర్యటన



పత్తికొండ మన జనప్రగతి నవంబర్ 03:-పత్తికొండ పట్టణంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ముస్లిం వీధి, కొండగేరి, వడ్డగేరి కట్ట, తేరుబజార్, కల్లుపెంట వీధి, మెయిన్ బజార్, అంబేద్కర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థులతో పాటు జడ్పీటీసీ అభ్యర్థికి మద్దతు తెలిపి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం ప్రధాన వ్యాపార కేంద్రమైన మెయిన్ బజార్‌లో వ్యాపారులను, స్థానిక ప్రజలను కలిసి పార్టీ తరపున ప్రచారం నిర్వహించారు. ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభ్యర్థుల విజయానికి కృషి చేశారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. ప్రజాసేవకురాలిగా నిలుస్తా:శాంతమ్మ



చిట్వేలి మన జనప్రగతి నవంబర్ 03:-చిట్వేలి ఎంపీటీసీ-2 స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాయుని శాంతమ్మ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. తన భర్త నాయుని గోపాల్‌తో కలిసి ఎంపీటీసీ-2 పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ మద్దతు కోరుతున్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ తనకు ఒక్క అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ సందర్భంగా శాంతమ్మ మాట్లాడుతూ ఉంగరం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. స్థానిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తానని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సహకరిస్తానని, ఎన్నికల తర్వాత కూడా ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు. తన ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని ఆమె అనుచరులు తెలిపారు.

జగన్ కోటలో కూటమి జెండా

- **పులివెందుల విజయం వెనుక బీటెక్ రవి రెండేళ్ల శ్రమ**
- **మున్సిపాలిటీ కైవసం**
- **చైర్‌పర్సన్‌గా గీతాకుమారి విజయం**
- **40 వార్డుల్లో 37 కూటమి ఖాతాలోకి..**
- **ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం,రూ.480 కోట్ల తాగునీటి పథకంపై ప్రత్యేక చొరవ**





కడప టౌన్ మన జనప్రగతి, నవంబర్ 03: వైఎస్సార్ కుటుంబానికి రాజకీయ కంచుకోటగా పేరున్న పులివెందుల మున్సిపాలిటీలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధించింది. మాజీ సీఎం వైఎస్ జగన్ సొంత నియోజకవర్గ కేంద్రంలో మున్సిపల్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. చైర్‌పర్సన్ అభ్యర్థి తూగుట్ల గీతాకుమారి 13,875 ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా, 40 వార్డులకు గాను ఏకగ్రీవ స్థానాలతో కలిపి కూటమి 37 వార్డులను గెలుచుకుంది. వైసీపీ మూడు వార్డులకే పరిమితమైంది. **విజయానికి రెండేళ్ల ప్రజా సంబంధాలే పునాది** పులివెందులలో టీడీపీ విజయానికి పార్టీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి రెండేళ్లుగా సాగించిన ప్రజా సంబంధాలు, నిరంతర కృషి ప్రధాన కారణమని టీడీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఎన్నికల సమయంలోనే కాకుండా గత రెండేళ్లుగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవడం, స్థానికులకు అందుబాటులో ఉండటం ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేశారు. **రూ.480 కోట్ల తాగునీటి పథకంపై ప్రత్యేక చొరవ** పులివెందుల ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం సుమారు రూ.480 కోట్ల తాగునీటి పథకాన్ని ముందుకు తీసుకెళ్లడంలో బీటెక్ రవి ప్రత్యేక చొరవ చూపారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో కేంద్ర నిధుల ద్వారా ఈ ప్రాజెక్టుకు కృషి చేసినట్లు పేర్కొన్నాయి. **నాయకుల ఐక్యతతో సమష్టి కృషి**పేర్ల పార్థసారథి రెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర నాయకులను సమన్వయం చేసుకుంటూ బీటెక్ రవి ఎన్నికల్లో ముందుకు సాగారు. నాయకుల మధ్య విభేదాలను పక్కనపెట్టి అందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడం కూటమి విజయానికి దోహదపడిందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతు న్నాయి. మొత్తంగా ప్రజలతో నిరంతర సంబంధాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి, నాయకుల సమన్వయం పులివెందులలో కూటమి విజయానికి కీలక అంశాలుగా నిలిచాయని టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

చరిత్ర తిరగరాసిన టిడిపి

- **వైఎస్ కోటలో టిడిపి కైవసం**
- **40 వార్డులలో 20 వార్డు ఏకగ్రీవం**
- **20 వార్డుల్లో పోటీ 17 కూటమి, 3 వైసీపీ గెలుపు**





పులివెందుల టౌన్ మన జనప్రగతి నవంబర్ 03:- మున్సిపల్ ఎన్నికలలో టిడిపి చరిత్ర తిరగరాసింది. 40 సంవత్సరాలుగా వైయస్ కుటుంబానికి నియమించిన వ్యక్తులే గెలిచేవారు. కానీ ప్రస్తుతం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైయస్ కోటలో టిడిపి కైవసం చేస్తుంది. మొత్తం పోలైన ఓట్లు 37842 పోలుగాక టిడిపి అభ్యర్థి తూగుట్ల గీతా కుమారికి 25375 ఓట్లు రాగా వైసీపీ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ కు 11475 ఓట్లు వచ్చాయి టిడిపి అభ్యర్థికి 13898 ఓట్లు మెజార్టీ వచ్చాయి. చెల్లని ఓట్లు 832, నోటాకు 102 ఓట్లు వచ్చాయి. మున్సిపాలిటీలో 40 వార్డులు ఉండగా వాటిలో 20 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి ఇందులో టిడిపి 19, బిజెపి 1 ఉన్నాయి. 20 వార్డులలో పోటీ ఉండగా 15 టీడీపీ, 3 వైసీపీ, 1 బిజెపి,1 జనసేన కైవసం చేసుకున్నాయి. 6 వార్డులో టిడిపి అభ్యర్థి బాలుడు పై వైసీపీ అభ్యర్థి పార్నపల్లి ఝాన్సీ మేరీ 466 మెజారిటీ తో గెలుపొందారు. 8 వార్డులో వైసీపీ అభ్యర్థి షేక్ ఖాదర్ బాషా పై టిడిపి అభ్యర్థి షేక్ బాబా ఫక్రుద్దీన్ 343 ఓట్లు తో గెలుపొందారు. 9 వార్డులో వైసీపీ అభ్యర్థి ఎం నీరజమ్మ పై జనసేన అభ్యర్థి ముని సుభాషిని 877 మెజారిటీతో గెలిచారు.10 వార్డులో వైసీపీ అభ్యర్థి పి నాగలక్ష్మి పై బిజెపి అభ్యర్థి యన్ విజయలక్ష్మి 630 మెజార్టీతో గెలిచారు. 11వ వార్డులో వైసిపి అభ్యర్థి షేక్ మహమ్మద్ బాషా పై టిడిపి అభ్యర్థి షేక్ ఫయాజ్ 390 మెజార్టీతో గెలిచారు. 12వ వార్డులో వైసీపీ అభ్యర్థి షేక్ హఫీజుల్ల పై టిడిపి అభ్యర్థి షేక్ మొహమ్మద్ అక్రమ్ 431 మెజార్టీతో గెలిచారు, 13వ వార్డులో వైసీపీ అభ్యర్థి ఎం దార కలందర్ పై టిడిపి అభ్యర్థి యన్. రామ్మోహన్ నాయుడు 178 మెజార్టీతో గెలిచారు. 15వ వార్డులో టిడిపి అభ్యర్థి పి శివ పై వైసీపీ అభ్యర్థి వల్లెపు వరప్రసాద్ 357 మెజార్టీతో గెలిచారు. 18 వ వార్డులో వైసీపీ అభ్యర్థి కాళ్ల భాస్కర్ పై టిడిపి అభ్యర్థి మునయ్య 391 మెజారిటీతో గెలిచారు.20 వార్డులో వైసిపి అభ్యర్థి సాకే వెంకటరమణ పై టిడిపి అభ్యర్థి పి. మునివర్ధన్ 377 మెజార్టీతో గెలిచారు. 21వ వార్డులో టిడిపి అభ్యర్థి బి అంకాల్ రెడ్డి పై వైసీపీ అభ్యర్థి వైయస్ మనోహర్ రెడ్డి 346 మెజార్టీతో గెలిచారు. 23వ వార్డులో వైసీపీ అభ్యర్థి యం. రాజేశ్వరి పై టిడిపి అభ్యర్థి కమలమ్మ 593 ఓట్లు మెజార్టీతో గెలిచారు, 24 వ వార్డులో వైసీపీ అభ్యర్థి కే ప్రభావతమ్మ పై టిడిపి అభ్యర్థి షేక్ మహబూబ్ జాన్ 907 మెజార్టీతో గెలిచారు. 25 వార్డులో వైసీపీ అభ్యర్థి బి వరలక్ష్మి పై టిడిపి అభ్యర్థి అన్నా రెడ్డి శివ పార్వతి 175 మెజార్టీతో గెలిచారు. 26వ వార్డులో వైసీపీ అభ్యర్థి యం . కృష్ణవేణి పై టిడిపి అభ్యర్థి కే లక్ష్మీదేవి 275 మెజారిటీతో గెలిచారు. 27వ వార్డులో వైసీపీ అభ్యర్థి కే లక్ష్మీ అనురాధ పై టిడిపి అభ్యర్థి సి హేమావతి 524 మెజార్టీతో గెలిచారు. 28వ వార్డులో వైసీపీ అభ్యర్థి గజ్జల విజయభాస్కర్ రెడ్డి పై టిడిపి అభ్యర్థి కొంగనపల్లి వెంకట సాయి కిషోర్ 213 మెజారిటీతో గెలిచారు. 31 వ వార్డులో వైసీపీ అభ్యర్థి కే. అంజనప్ప పై టిడిపి అభ్యర్థి ఎస్. శ్రీనివాసులు 620 మెజార్టీతో గెలిచారు, 33 వ వార్డులో వైసీపీ అభ్యర్థి నిరంజన్ రెడ్డి పై టిడిపి అభ్యర్థి తూగుట్ల మధుసూదన్ రెడ్డి 593 మెజార్టీతో గెలిచారు.

అభివృద్ధికి పట్టం కట్టిన ప్రజలు

- **పరిషత్ ఎన్నికల్లోనూ కూటమి స్వీప్ చేస్తుంది: మంత్రి సవిత**
- **పెనుకొండలో విజయోత్సవ ర్యాలీ**
- **గెలిచిన అభ్యర్థులకు సత్కారం**



పెనుకొండ, మన జనప్రగతి, నవంబర్ 03:- రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కడుతూ కూటమి అభ్యర్థులకు ఘనవిజయం అందించారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. ప్రజలు జగన్‌కు తగిన సమాధానం చెప్పారని, రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ కూటమి క్లీన్ స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.మంగళవారం పెనుకొండ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం అనంతరం పట్టణంలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలు ప్రజల ఆదరణ పొందాయన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు మద్దతు తెలిపారని పేర్కొన్నారు. పెనుకొండ మున్సిపాలిటీలో 23 వార్డులతో పాటు చైర్మన్ స్థానాన్ని కూడా కూటమి కైవసం చేసుకుందని తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రజలు మద్దతుగా నిలిచారని, ఇదే ఆదరణను రాబోయే పరిషత్ ఎన్నికల్లోనూ కొనసాగించాలని కోరారు.అనంతరం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి త్రివేంద్రమూర్తి, విజయం సాధించిన వార్డు కౌన్సిలర్లను మంత్రి సవిత ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పులివెందుల 9వ వార్డును కైవసం చేసుకున్న జనసేన

- వైసీపీ అభ్యర్థిపై 877 ఓట్ల మెజార్టీతో ఆలూరు మునిసుభాషిని విజయం



పులివెందుల టౌన్ మన జనప్రగతి నవంబర్ 03:పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో 9వ వార్డును జనసేన పార్టీ కైవసం చేసుకుంది. జనసేన అభ్యర్థి ఆలూరు మునిసుభాషిని, వైసీపీ అభ్యర్థి నీరజమ్మపై 877 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.ఓట్ల లెక్కింపులో ఆలూరు మునిసుభాషినికి 971 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి నీరజమ్మకు 94 ఓట్లు వచ్చాయి. నోటాకు 2 ఓట్లు పోలవగా, 8 ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి. మొత్తం 1,067 ఓట్లు పోలయ్యాయి.దీంతో 9వ వార్డులో జనసేన అభ్యర్థి ఆలూరు మునిసుభాషిని 877 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.

జగన్ ఓటు ఉన్న 15వ వార్డులో వైసీపీ అభ్యర్థి విజయం

• టీడీపీ అభ్యర్థిపై 357 ఓట్ల మెజార్టీతో వర ప్రసాద్ గెలుపు



పులివెందుల టౌన్ మన జనప్రగతి నవంబర్ 03:-పులివెందుల మున్సిపాలిటీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఓటు ఉన్న 15వ వార్డులో వైసీపీ అభ్యర్థి విజయం సాధించారు. ఈ వార్డు ఎన్నికల ఫలితంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొనగా, వైసీపీ అభ్యర్థి వర ప్రసాద్ తన సమీప ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి పెద్దింటి శివపై 357 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.ఓట్ల లెక్కింపులో వైసీపీ అభ్యర్థి వర ప్రసాద్‌కు 526 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థి పెద్దింటి శివకు 169 ఓట్లు పోలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులు బండి బోయిన కమలనాథ్‌కు ఒక ఓటు, కొత్తరెడ్డి మల్లికార్జున్ రెడ్డికి రెండు ఓట్లు వచ్చాయి. నోటాకు రెండు ఓట్లు పోలవగా, 34 ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి.మాజీ సీఎం వైఎస్ జగన్ ఓటు హక్కు కలిగిన ఈ వార్డులో వైసీపీ అభ్యర్థి విజయం సాధించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

ద్విచక్ర వాహనం ఢీకొని గోమాత మృతి



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 03:-ద్విచక్ర వాహనం ఢీకొనడంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గోశాలకు చెందిన గోమాత మృతి చెందింది. ఈ ఘటన ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మొహద్దీన్ సాహెబ్ పల్లెలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గోశాలకు చెందిన గోమాతలు ప్రతిరోజూ కొండ ప్రాంతానికి మేతకు వెళ్లి తిరిగి గోశాలకు చేరుకుంటు ంటాయి. ఈ క్రమంలో ఒక గోమాత కనిపించకపోవడంతో గోశాల నిర్వాహకులు సోమవారం రాత్రి వెతుకుతుండగా, మాధవరం హైవేపై ప్రమాదానికి గురై మృతి చెందినట్లు స్థానికులు సమాచారం అందించారు. భాకరాపేట నుంచి ద్విచక్ర వాహనంపై అతివేగంగా వస్తున్న మహేష్ అనే యువకుడు గోమాతను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు గోశాల ట్రస్ట్ అధినేత లక్ష్మీ నరసింహ స్వామి తెలిపారు. మృతి చెందిన గోమాతకు హిందూ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి, సిద్ధవటం మండలంలోని ఆవుల మారెమ్మ గుట్టపై దహన సంస్కారాలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

దాతృత్వంతో చిరకీర్తి పొందిన సంపత్ కుమార్: వీసీ రాజశేఖర్



కడప, మన జనప్రగతి, నవంబర్ 03:- సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ ఏర్పాటుకు 20 సెంట్ల స్థలాన్ని విరాళంగా అందించి, దాతృత్వంతో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి సి.కె. సంపత్ కుమార్ అని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు.యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మంగళవారం సంపత్ కుమార్ 86వ జయంతి, స్మారకోపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపకులపతి మాట్లాడుతూ సంపత్ కుమార్ గ్రంథాలయానికి స్థలం ఇవ్వడమే కాకుండా, సి.పి.బ్రౌన్ మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడిగా సేవలందించారని తెలిపారు. గ్రంథాలయ నిర్మాణానికి అవసరమైన నిధుల సేకరణలో డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రితో కలిసి కృషి చేశారని కొనియాడారు.రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.సి. గంగిరెడ్డి మాట్లాడుతూ 1976లో ప్రముఖులు బ్రౌన్ నివసించిన బంగళా శిథిలాలను గుర్తించి, అక్కడ స్మారక గ్రంథాలయ ఏర్పాటుకు కృషి చేశారని వివరించారు. కేంద్రం సంచాలకులు ఆచార్య గంజి పార్వతి మాట్లాడుతూ సంపత్ కుమార్ కుమార్తె సి.ఎస్. సుప్రజ కూడా గ్రంథాలయానికి మరో ఐదు సెంట్ల స్థలాన్ని విరాళంగా అందించడం అభినందనీయమన్నారు. జానమద్ది విజయభాస్కర్, పరిశోధకులు, గ్రంథాలయ సిబ్బంది, ఇతరులు పాల్గొన్నారు.

రాప్తాడు దాడి నిందితుడి కుడి కాలు తొలగింపు

- కొనసాగుతున్న చికిత్స



అనంతపురం మన జనప్రగతి నవంబర్ 03:- అనంతపురం జిల్లాలోని రాప్తాడులో ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థినిపై చైన్‌సాతో దాడికి పాల్పడిన నిందితుడు హేమంత్ తన కుడి కాలును కోల్పోయాడు. అరెస్టు సమయంలో పోలీసుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడటంతో, వైద్యులు అతడి కాలును తొలగించాల్సి వచ్చింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో (జీజీహెచ్) ఈ శస్త్రచికిత్స నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి తెలిపారు.ఆదివారం ఆత్మకూరు అటవీ ప్రాంతంలో హేమంత్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ సమయంలో అతడు లొంగిపోకుండా ప్రతిఘటించడమే కాక, ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై దాడికి ప్రయత్నించాడు. పోలీసులు హెచ్చరికగా కాల్పులు జరిపినా వెనక్కి తగ్గకపోవడంతో, ఆత్మరక్షణ కోసం నిందితుడి కాళ్లపై కాల్పులు జరిపారు.ఈ కాల్పుల్లో హేమంత్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. అయితే, కుడి కాలిలో రక్త ప్రసరణ పూర్తిగా నిలిచిపోయి కణజాలం దెబ్బతినడంతో, మోకాలి పైభాగం నుంచి కాలును తొలగించడం తప్పనిసరి అయింది. దెబ్బతిన్న రక్తనాళాల కారణంగా ఎడమ కాలికి కూడా వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం హేమంత్‌స్థ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని వైద్యులు వెల్లడించారు.అక్టోబర్ 31న రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి గదిలోకి చొరబడిన హేమంత్, చైన్‌సాతో ఇద్దరు విద్యార్థినులపై దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గోపిక అనే విద్యార్థిని తీవ్రంగా గాయపడగా, బెంగళూరులో చికిత్స అనంతరం కోలుకుంటోంది. ఆమెను కాపాడే ప్రయత్న ంలో మరో విద్యార్థిని కూడా గాయపడింది. ఈ కేసుపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఒంటిమిట్టలో కూటమి అభ్యర్థుల తరఫున విస్తృత ప్రచారం

• చిన్నకొత్తపల్లి, గంగపేరూరు, ఇబ్రహీంపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టిన అతికారి కృష్ణ



ఒంటిమిట్ట మన జనప్రగతి నవంబర్ 03:-ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో చివరి రోజు ప్రచారంలో భాగంగా ఒంటిమిట్ట మండలంలో కూటమి అభ్యర్థుల తరఫున రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని చిన్నకొత్తపల్లి, గంగపేరూరు, ఇబ్రహీంపేట తదితర గ్రామాల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థి కోనేటి హరి వెంకటరమణ, జడ్పీటీసీ అభ్యర్థి కదిరి విజయమ్మలను పరిచయం చేస్తూ వారి తరఫున ఓట్లు అభ్యర్థించారు. ఎంపీటీసీ అభ్యర్థి కోనేటి హరి వెంకటరమణకు గాజు గ్లాసు గుర్తుపై, జడ్పీటీసీ అభ్యర్థి కదిరి విజయమ్మకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి మద్దతు తెలపాలని ప్రజలను కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని వివరిస్తూ, ప్రజలు తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రచార కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నవంబర్ 5న జరగనున్న పోలింగ్‌లో ఓటర్లు చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్నపల్లెలో కూటమి అభ్యర్థి సరళాదేవికి మద్దతుగా ప్రచారం

• సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఓటర్లను అభ్యర్థించిన కూటమి నేతలు



లింగాల, మన జనప్రగతి నవంబర్ 03:-లింగాల మండలంలోని పార్నపల్లె గ్రామంలో కూటమి జడ్పీటీసీ అభ్యర్థి యమ్మనూరు సరళాదేవి విజయమే లక్ష్యంగా కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సింహాద్రిపురం జడ్పీటీసీ సభ్యుడు మారెడ్డి భరత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలను కలుసుకున్న నాయకులు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొంటూ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళాదేవికి మద్దతు తెలిపి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో జొన్నలగడ్డ ధనుంజయ నాయుడు (పార్నపల్లె ధన), పులివెందుల మార్కెట్ యార్డు చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, లింగాల మండల టీడీపీ ఇన్‌చార్జి దేవిరెడ్డి సంజీవరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు యమ్మనూరు విశ్వనాథరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం,అభివృద్ధికే ప్రజల మద్దతు..

సింహాద్రిపురం జడ్పీటిసి మారెడ్డి భరత్ రెడ్డి



లింగాల మన జనప్రగతి నవంబర్ 03- మండలంలోని పార్నపల్లె గ్రామంలో కూటమి జడ్పీటీసీ అభ్యర్థి యమ్మనూరు సరళ దేవి గారి గెలుపే లక్ష్యంగా మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని సింహాద్రిపురం జడ్పీటీసీ సభ్యుడు మారెడ్డి భరత్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా భరత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలకు తెలియజేశారు.కూటమి నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజలను కలిసి కూటమి లింగాల జడ్పీటీసీ అభ్యర్థి యమ్మనూరు సరళ దేవికి మద్దతు తెలిపి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ ధనుంజయ నాయుడు(పార్నపల్లె ధన) ,పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ , లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవ రెడ్డి ,లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు యమ్మనూరు విశ్వనాథ రెడ్డి, లింగాల మండల సింగిల్ విండో అధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి, పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల 20వ వార్డును కైవసం చేసుకున్న టీడీపీ

- వైసీపీ అభ్యర్థిపై 378 ఓట్ల మెజార్టీతో పెద్దమర్ల మునివర్ధన్ యాదవ్ విజయం



పులివెందుల మన జనప్రగతి నవంబర్ 03:-పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో 20వ వార్డును తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి పెద్దమర్ల మునివర్ధన్ యాదవ్, వైసీపీ అభ్యర్థి వెంకటరమణపై 378 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.ఈ వార్డులో మొత్తం 934 ఓట్లు పోలవగా, టీడీపీ అభ్యర్థి మునివర్ధన్ యాదవ్‌కు 648 ఓట్లు, వైసీపీ అభ్యర్థి వెంకటరమణకు 271 ఓట్లు వచ్చాయి. నోటాకు 2 ఓట్లు పోలవగా, 13 ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి.దీంతో మునివర్ధన్ యాదవ్ 378 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 20వ వార్డులో టీడీపీ విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

సేవ చేసే సంకల్పం ఉంది.. ఒక్క అవకాశం కల్పించండి

• ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తా..
• బీసీవై జడ్పీటీసీ అభ్యర్థి వంగేపురం కార్తీక్ రాజు



కనిగిరి మన జనప్రగతి నవంబర్ 03:కనిగిరి మండల పరిధిలోని చాకిరాల, నేలటూరి గొల్లపల్లె గ్రామాల్లో బీసీవై పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి వంగేపురం కార్తీక్ రాజు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ తనను జడ్పీటీసీగా గెలిపిస్తే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని విజ్ఞప్తి చేశారు.ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, మండల అభివృద్ధికి తన వంతు బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. పదవిని అధికారం కోసం కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. తనకు ఒక్క అవకాశం కల్పించి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో మార్కాపురం జిల్లా అధ్యక్షుడు సిరిమామిళ్ల నరేంద్రబాబు, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ నజీర్ బాషా, పార్టీ నాయకులు మల్లికార్జున, రేగలగడ్డ వెంకట్రావు, మిథికాల వీరాంజనేయులు, షేక్ షారూక్, వెంకీతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో అదుపుతప్పి కిందపడిన యువకుడు

● ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు..కడప రిమ్స్‌కు తరలింపు



సిద్ధవటం మన జనప్రగతి నవంబర్ 03:-మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతూ అదుపుతప్పి కిందపడటంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన సిద్ధవటం మండలంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కడప నుంచి బద్వేల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మున్నంగి శివ అనే యువకుడు సిద్ధవటంబద్వేల్ ప్రధాన రహదారిలోని సాహెబ్ బావి కొత్త బ్రిడ్జి సమీపంలో వాహనంపై నియంత్రణ కోల్పోయి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి బలమైన రక్తపు గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రుడిని ఆటోలో సిద్ధవటం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై సిద్ధవటం పోలీసులు విచారణ చేపట్టారు.

ముగిసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం..మూగబోయిన మైకులు



బొమ్మనహాల్ మన జనప్రగతి నవంబర్ 03:- మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రచార పర్వం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ప్రచారానికి తెరపడటంతో గ్రామాల్లో మైకులు మూగబోయాయి. నామినేషన్ల ప్రక్రియ పూర్తయినప్పటి నుంచి అభ్యర్థులు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.ప్రచార గడువు ముగియడంతో అభ్యర్థులు ఓటర్లను నేరుగా కలుసుకుని తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచే మద్యం దుకాణాలు, బార్లను మూసివేయనున్నారు. ఈ నెల 7వ తేదీన ఓట్ల లెక్కింపు సందర్భంగా కూడా మద్యం దుకాణాలు, బార్లు మూసివేయనున్నారు.ఈ నెల 5వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అవసరమైతే 6వ తేదీన రీపోలింగ్ చేపట్టనున్నారు. 7వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు. బొమ్మనహాల్ మండలంలో ఒక జడ్పీటీసీ స్థానంతో పాటు 16 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తమయ్యారు. 144 సెక్షన్, పోలీసు చట్టం 30 అమలు చేస్తూ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఓటర్ల జాబితాలో పేర్ల జంపింగ్‌పై జనసేన నాయకుడు శ్రీకాంత్ ఆందోళన

- మాధవరం-1 ఓటర్ల జాబితాలో తప్పిదాలు.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం



సిద్ధవటం మన జనప్రగతి నవంబర్ 03:-మాధవరం-1 మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఓటు హక్కు కలిగిన పలువురు ఓటర్ల పేర్లు ఓటర్ల జాబితాలో ఒకబూతునుండి మరొకబూతులోకి సంబంధం లేని ఇతర పోలింగ్ కేంద్రాలకు మారడం పట్ల సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలేఖ భర్త, జనసేన నాయకుడు దేరంగుల శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం మాధవరం-1 గ్రామంలో ఆయన మాట్లాడుతూ, ఏళ్లుగా అదే గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారి పేర్లు సైతం స్థానిక పోలింగ్ బూత్‌లో కాకుండా ఇతర ప్రాంతాల జాబితాల్లో నమోదయ్యాయని తెలిపారు. దీంతో ఓటర్లు తమ ఓటు ఎక్కడ ఉందో తెలియక అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు.ఓటర్ల గుర్తింపు, ఇంటింటి సర్వే నిర్వహణలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే ఇలాంటి తప్పిదాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరికీ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ఓటర్ల జాబితాలో జరిగిన తప్పిదాలను సరిచేసి అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం చేయాలని కోరుతూ లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించనున్నట్లు దేరంగుల శ్రీకాంత్ తెలిపారు.

13,898 ఓట్ల భారీ మెజార్టీతో చైర్‌పర్సన్‌గా తూగుట్ల గీతా కుమారి గెలుపు

- పులివెందుల మున్సిపాలిటీలో టీడీపీ చారిత్రక విజయం



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 03:వైఎస్సార్ జిల్లా రాజకీయాల్లో పెను సంచలనం నమోదైంది. పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) చారిత్రక విజయం సాధించి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల పోరులో టీడీపీ తరఫున చైర్‌పర్సన్ అభ్యర్థిగా బరిలోకి దిగిన తూగుట్ల గీతా కుమారి,తన సమీప ప్రత్యర్థి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) అభ్యర్థి వై.ఎస్.ప్రమీలమ్మపై ఏకంగా 13,898 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు.కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అధికారికంగా ఫలితాలను వెల్లడించి,తూగుట్ల గీతా కుమారి గెలుపొందినట్లు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

ఆశీర్వదించండి అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా..

● ప్రచారానికి చివరి రోజు కావడంతో పెద్దా ఎత్తున తరలిన అభిమాన నాయకులు

● ప్రతి ఓటర్లను పలకరిస్తూ ప్రతి ఇంటికి అభివృద్ధి లక్ష్యంగా పిలుపు..

● తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ -1 అభ్యర్థి.పి.సోమనాథ్





బొమ్మనహాల్ మన జనప్రగతి నవంబర్ 03:-బొమ్మనహాల్ మండలం పరిధిలో గోవిందవాడ గ్రామ ఎన్డీఏ కుటుంబ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు కావడంతో పెద్దా ఎత్తున అభిమాన నాయకులు కార్యకర్తలు ఉత్సాహభరితంగా ఎన్నికలు ప్రచారాన్ని నిర్వహించారు. గోవిందవాడ గ్రామ తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ -1 అభ్యర్థి పి.సోమనాథ్ ప్రజల మధ్యకు వెళ్లి ప్రతి ఇంటి ఇంటికి తలుపు తట్టి అవ్వ తాతలను,ప్రతి అన్న తమ్మున్ని,అక్కా చెల్లెమ్మలను ఆప్యాయంగా పలకరిస్తూ, కలుస్తూ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు.**ఇంటి ఇంటికి ప్రచారం.. ప్రజలతో మమేకం**గ్రామంలోని ప్రతి వీధిలో అడుగులు వేస్తూడప్రతి ఇంటి వద్ద సమస్యలు ఆగుతూ..ప్రజల సమస్యలను తెలుసుకుంటూ.. గ్రామాభివృద్ధి లక్ష్యాలను వివరిస్తూ..ప్రజల ఆదరణతో ప్రచారాన్ని ముందుకు సాగించారు,**ప్రజల ఆశయమే లక్ష్యం..గ్రామాభివృద్ధే ధ్యేయంగా ముందుకు** గ్రామ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో, తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ-1 అభ్యర్థి పి.సోమనాథ్ అను నాకు నవంబర్ 5 తేదీన జరగబోయే ఎంపీటీసీ ఎన్నికలలో తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి వేయించి అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. **ఎన్నికల ప్రచారం చివరి రోజుతో ప్రజల మధ్య ప్రచార జోరు..కార్యకర్తల్లో విజయోత్సాహం** ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమం మంగళవారం ముగియడంతో గోవిందవాడ గ్రామ తెలుగుదేశం, జనసేనా,భాజపా నాయకులు, గ్రామ ప్రజలు,అభిమాన కార్యకర్తలు,యువ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారానికి మరింత ఉత్సాహాన్ని నింపారు.అందరినీ కలుపుకొని కార్యకర్తల అడుగుల్లో వేగం.. ప్రజల పలకరింపుల్లో ఆప్యాయత..ప్రచార ప్రస్థానంలో ఉత్సాహం కనిపించాయి,"చివరిగా పి.సోమనాథ్ మాట్లాడుతూ..సమాజమే దేవాలయం- ప్రజలే దేవుళ్ళు అంటూ ముందుకు సాగి ఐక్యతే బలం..అభివృద్ధే లక్ష్యం.. విజయమే లక్ష్యంగా ముందుండి గ్రామ అభివృద్ధికి పని చేస్తానని.. 5 వ తేదిన జరగబోయే ఎన్నికల్లో తప్పకుండా సైకిల్ గుర్తుపై ఓటు వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని,ఎంపీటీసీ -1 అభ్యర్థి పి.సోమనాథ్ ఓటర్లను కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు:డాక్టర్ శ్రీవిద్య



సిద్ధవటం మన జనప్రగతి నవంబర్ 03:-తుఫాన్ ప్రభావం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య సూచించారు. మంగళవారం మాధవరం -1 గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల చుట్టూ, పూల మొక్కల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన పేడ దిబ్బలను తొలగించి దోమల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణా లతో బాధపడేవారు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని కోరారు. ముఖ్యంగా వర్షాలు, తుఫాన్ల సమయంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలిచాం



చిట్వేలి మన జనప్రగతి నవంబర్ 03:వ్యక్తిగత దూషణలు, వారసత్వ రాజకీయాలకు తావులేకుండా ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలిచానని చిట్వేలి జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థి, కుక్కర్ గుర్తుపై పోటీ చేస్తున్న బుంగటావుల భాస్కర్ తెలిపారు. ప్రజల ఆదరణతో విజయం సాధించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఎన్నికల అనంతరం కూడా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భాస్కర్ స్పష్టం చేశారు. చిట్వేలి జడ్పీటీసీ అభ్యర్థిగా తనకు, నగరిపాడు ఎంపీటీసీ అభ్యర్థి లీలావతికి కుక్కర్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించండి..

- ఎంపీపీ అభ్యర్థి దివాకర్ నాయుడు విజ్ఞప్తి



దేవనకొండ మన జనప్రగతి నవంబర్ 03:-దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన ఎంపీపీ అభ్యర్థి దివాకర్ నాయుడు మండలంలోని 44 గ్రామాల ప్రజలను ఉద్దేశించి ఎన్నికల ప్రచారంలో మద్దతు కోరారు. రాబోయే ఎంపీపీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎంపీపీగా గెలిపించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని, తన విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తనకు మద్దతుగా నిలవాలని ఓటర్లను అభ్యర్థించారు.

నీటి పొదుపును జీవితంలో భాగం చేసుకోవాలి


● వైవీయూలో నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం



కడప, మన జనప్రగతి, నవంబర్ 03:- ప్రతి ఒక్కరూ నీటి పొదుపును తమ జీవితంలో భాగం చేసుకోవాలని వైవీయూ జాతీయ సేవా పథకం విభాగ సమన్వయకర్త ప్రొఫెసర్ ఎం. సుభోష్ చంద్ర పిలుపునిచ్చారు.యోగి వేమన విశ్వవిద్యాలయంలో నవంబర్ 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ వి. సునీత వర్షపు నీటి సేకరణ, సహజ వనరుల పరిరక్షణ, నీటి సమర్థ వినియోగం గురించి వివరించారు. కార్యక్రమ కన్వీనర్ ప్రొఫెసర్ ఎల్. దాక్షాయణి మాట్లాడుతూ భూగర్భ జలాలు, తాగునీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కుళాయిలను అవసరం లేనప్పుడు మూసివేయడం, నీటి లీకేజీలను అరికట్టడం వంటి చిన్న చర్యలతో నీటి వృథాను నివారించవచ్చని సూచించారు.నీటి సంరక్షణలో విద్యార్థులు, యువత, ప్రజలు భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు.

పులివెందుల 12వ వార్డులో టీడీపీ ఘన విజయం

- 431 ఓట్ల మెజార్టీతో మహ్మద్ అక్రమ్ గెలుపు



పులివెందుల మన జనప్రగతి నవంబర్ 03:-పులివెందుల మున్సిపల్ 12వ వార్డును టీడీపీ కైవసం చేసుకుంది. టీడీపీ అభ్యర్థి మహ్మద్ అక్రమ్ 645 ఓట్లు సాధించి, వైసీపీ అభ్యర్థి షేక్ హాఫిజుల్లా (214 ఓట్లు) పై 431 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. నోటాకు 2 ఓట్లు పోలవగా, 15 ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి. ఈ వార్డులో మొత్తం 876 ఓట్లు పోలయ్యాయి.

తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి అతలాకుతలమైన కాకినాడ నగరం



కాకినాడ మన జనప్రగతి నవంబర్ 03:మురుసు తుఫాను కారణంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి కాకినాడ నగరం జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.మంగళవారం మధ్యాహ్నం సుమారు మూడు గంటల పాటు ఏకధాటిగా దొరికిన వర్షానికి నగరంలో లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. ఎక్కడ చూసినా వర్షపునీరుతో రోడ్లు కాలువలు ఏకం కావడంతో ప్రయాణికులు దేవర ఇబ్బందులకు గురయ్యారు.జిల్లా కలెక్టర్ కార్యాలయం కూడా నీట మునగడంతో ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇది ఇలా ఉంటే ఒకవైపు ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలకు కావలసిన ప్రక్రియలు పూర్తి చేసేందుకు ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు.

పులివెందుల 11వ వార్డులో టీడీపీ విజయం



పులివెందుల మన జనప్రగతి నవంబర్ 03:-పులివెందుల మున్సిపల్ 11వ వార్డును టీడీపీ కైవసం చేసుకుంది. టీడీపీ అభ్యర్థి షేక్ ఫయాజ్ 586 ఓట్లు సాధించి, వైసీపీ అభ్యర్థి మహ్మద్ బాషా (196 ఓట్లు)పై 390 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. స్వతంత్ర అభ్యర్థి షేక్ నాయాజ్‌కు 3 ఓట్లు రాగా, 34 ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి. మొత్తం 819 ఓట్లు పోలయ్యాయి.

లింగాలలో 23 పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్



లింగాల మన జనప్రగతి నవంబర్ 03:-స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండల పరిధిలోని గ్రామపంచాయతీలో ఈనెల 5వ తేదీ జరగనున్న లింగాల మండల జడ్పిటిసి, ఎంపిటిసి స్థానాల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ స్థానిక ఎంపీడీవో సభాభవనంలో మంగళవారం జరిగింది.మండల పరిధిలోని 9 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం కావడంతో లింగాల జడ్పిటిసి స్థానానికి మాత్రమే వైకాపా, టిడిపి మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. దీంతో మండల పరిధిలో పనిచేసే అర్హులైన ప్రభుత్వ ఉద్యోగులు తమపోస్టల్ బ్యాలెట్ పేపర్లను స్థానిక ఎంపీడీవో సభా భవనంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 23మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ రూపంలో వినియోగించుకున్నట్లు మండల ఎన్నికల అధికారి సుహాసిని తెలిపారు.ఇంకా ఎవరైనా ఉద్యోగులు తమ వద్ద ఉన్న పోస్టల్ బ్యాలెట్ పేపర్లను బుధవారం మధ్యాహ్నం 12 గంటల లోపు స్థానిక ఎంపీడీవో సభా భవనంలో తమ ఓటు హక్కుగా వినియోగించుకోవాలని ఆర్వో సుహాసిని తెలిపారు.

పులివెందుల 13వ వార్డులో టీడీపీ విజయం



- 178 ఓట్ల మెజార్టీతో రామ్మోహన్ నాయుడు గెలుపు

పులివెందుల మన జనప్రగతి నవంబర్ 03:-
పులివెందుల మున్సిపల్ 13వ వార్డులో టీడీపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థి దాదా కలందర్‌పై 178 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రామ్మోహన్ నాయుడుకు 529 ఓట్లు, వైసీపీ అభ్యర్థికి 351 ఓట్లు పోలయ్యాయి. నోటాకు 4 ఓట్లు రాగా, 33 ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి. మొత్తం 917 ఓట్లు పోలయ్యాయి.

రైలు కింద పడి వ్యక్తి మృతి..!



కొండాపురం మన జనప్రగతి నవంబర్ 03:కొండాపురం రైల్వే స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనలో మృతుడి తల మొండెం నుంచి వేరైంది. మృతుడిని కొండాపురం మండలం ఓబన్నపేట గ్రామానికి చెందిన ఎన్. రామమోహన్ (55)గా గుర్తించారు.రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనతో స్థానికంగా కలకలం రేగింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

నీటిని ఆదా చేద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

● పులివెందుల ఎంవిఐ వెంకట ప్రసాద్ ● పులివెందుల ఎంవిఐ కార్యాలయంలో ఘనంగా బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలు ● నీటి సంరక్షణపై సిబ్బంది, వాహనదారులకు విస్తృత అవగాహన



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 03:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పులివెందుల మోటారు వాహనాల తనిఖీ అధికారి (ఎంవిఐ) కార్యాలయంలో 'బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలు' (బ్రిక్స్ సస్టైనబుల్ లైఫ్‌స్టైల్ వీక్ 2026) మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నీటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది.ఈ కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ అధికారి వెంకట ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన 'మిషన్ లైఫ్' లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఎంవిఐ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ జీవకోటికి అత్యంత కీలకమైన సహజ వనరు నీరని,ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు.ఇళ్లలో,కార్యాలయాల్లో కుళాయిల లీకేజీలను తక్షణమే అరికట్టాలని,తాగునీటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.నీటితో పాటు విద్యుత్ పొదుపు పాటించడం,ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించడం,పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పలువురు వాహనదారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు:కమిషనర్





కాకినాడ మన జనప్రగతి నవంబర్ 03:-కాకినాడ నగరంలో భారీ వర్షాలు కురిసినా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ, నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.నగరంలోని మహాలక్ష్మీనగర్‌లో ప్రధాన డ్రైనేజీ వ్యవస్థను కమిషనర్ పరిశీలించారు. డ్రైన్లలో పూడిక, ఇతర అడ్డంకులను తొలగించడంతో వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లిందని తెలిపారు.దుర్గానగర్‌లో రహదారులు నీట మునిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో నారాయణ స్కూల్ పరిసరాల్లో ప్రత్యేక డ్రైనేజీ క్లియరెన్స్ పనులు చేపట్టి నీటిని తొలగించినట్లు వివరించారు.అదేవిధంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం లోతట్టు ప్రాంతం కావడంతో పాటు డ్రైనేజీపై ఉన్న ఆక్రమణల కారణంగా నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడ్డాయని, వాటిని తొలగించి డ్రైనేజీని శుభ్రం చేయడంతో ప్రస్తుతం నీరు సజావుగా ప్రవహిస్తోందని చెప్పారు. ఎంతటి భారీ వర్షం కురిసినా గరిష్ఠంగా రెండు గంటల్లో వర్షపు నీటిని బయటకు పంపించే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ, నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా నగరపాలక సంస్థ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ వెల్లడించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్ ఉన్నారు.

ప్రజా సేవే పరమావధిగా పనిచేస్తా...

● పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ తూగుట్ల గీతా కుమారి
● చైర్మన్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన బీటెక్ రవికి ప్రత్యేక కృతజ్ఞతలు
● ప్రతి వార్డు సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం
● మౌలిక వసతులు, పారిశుధ్యానికి తొలి ప్రాధాన్యం



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 03: పుర‌ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజాసేవయే పరమావధిగా పనిచేస్తామని పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ తూగుట్ల గీతా కుమారి స్పష్టం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో తనను ఆదరించి, భారీ మెజారిటీతో గెలిపించిన పట్టణ ప్రజలకు ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తనకు పులివెందుల మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా అవకాశం కల్పించి అన్ని రకాలుగా అండదండలు అందించి, రాజకీయంగా మార్గదర్శనం చేసిన టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.పులివెందుల పురపోరులో అనేక ఉత్కంఠభరితమైన పరిణామాల అనంతరం,మంగళవారం హైకోర్టు వెలువరించిన తీర్పు మేరకు నిర్వహించిన కౌంటింగ్‌లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.ఈ విజయం పులివెందుల ప్రజల విజయమని,వారి నమ్మకానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గీత కుమారి మాట్లాడుతూ పులివెందుల పట్టణ సమగ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రతి వార్డులోని ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా తెలుసుకుని,వాటిని సత్వరమే పరిష్కరించేలా పక్కా కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు.ముఖ్యంగా పట్టణ పరిధిలో మౌలిక వసతుల కల్పన,నిరంతర తాగునీటి సరఫరా, అంతర్గత రహదారుల నిర్మాణం,పారిశుధ్య నిర్వహణకు తొలి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ,రాజకీయాలకు అతీతంగా పులివెందులను రాష్ట్రంలోనే ఒక ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

ముమ్మరంగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం

● తెర్నేకల్,బి.సెంటర్,గుమ్మరాల గ్రామాల్లో అభ్యర్థుల విస్తృత పర్యటన



దేవనకొండ మన జనప్రగతి నవంబర్ 03:దేవనకొండ మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా తెర్నేకల్, బి.సెంటర్, గుమ్మరాల గ్రామాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల తరఫున పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరారు.మీఈ ప్రచార కార్యక్రమంలో దేవనకొండ జడ్పీటీసీ అభ్యర్థి కొత్తకాపు వేదవతి భర్త కొత్తకాపు మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ-1 అభ్యర్థి దబ్బల లక్ష్మి, ఎంపీటీసీ-2 అభ్యర్థి మొగతాళి బెంజిమెన్ పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ మొగతాల్ అరుణ్ కుమార్, మాజీ ఎంపీటీసీలు నామాల శ్రీను, చాప ఈరన్న, మాజీ ఉపసర్పంచ్ ఈరన్న, సత్యరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు దుమ్ము హనుమంతు, అడివెన్న, సుందరాజు, లింగన్న, యేసేపు, ఎరుకుల రామాంజనేయులు, నాగన్న, బొబ్బే శివ, దబ్బల వెంకటరాముడు తదితరులు పాల్గొని అభ్యర్థుల విజయానికి కృషి చేశారు.

పులివెందుల 15వ వార్డులో వైఎస్సార్‌సీపీ విజయం

● మాజీ మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్ ఘన విజయం
● జగన్‌మోహన్ రెడ్డి,అవినాష్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపిన వరప్రసాద్
● ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేస్తానని ప్రకటన



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 03:పులివెందుల మున్సిపాలిటీ వార్డు ఫలితాల్లో భాగంగా 15వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి,మాజీ మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్ ఘన విజయం సాధించారు.తన సమీప ప్రత్యర్థి అయిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి శివపై ఆయన దాదాపు 357 ఓట్ల మెజారిటీతో విజయం దక్కించుకున్నారు.ఈ విజయం అనంతరం వల్లెపు వరప్రసాద్ మాట్లాడుతూ,తనను ఆదరించి గెలిపించిన 15వ వార్డు ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు తనకు ప్రజాసేవ చేసేందుకు మళ్లీ అవకాశం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి,వైఎస్ మనోహర్ రెడ్డి,దుష్యంత్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గడిచిన 15 ఏళ్లుగా పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో కౌన్సిలర్‌గా,వైస్ చైర్మన్‌గా,చైర్మన్‌గా ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్నానని ఆయన గుర్తుచేశారు.వార్డులోని ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటూ,అన్ని విధాలుగా చేదోడు వాదోడుగా నిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

పులివెందులలో కూటమి చరిత్రాత్మక విజయం

● అభివృద్ధి ఆశించి గెలిపించినందుకు కృతజ్ఞతలు
● పులివెందుల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి కృతజ్ఞతలు
● పులివెందుల అభివృద్ధిని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతర కృషి



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 03: పులివెందుల పట్టణ అభివృద్ధిని ఆకాంక్షించి కూటమిని గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తామని టీడీపీ పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి స్పష్టం చేశారు.మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పులివెందులలోని మొత్తం 40 వార్డులకు గాను 37 స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు.అదేవిధంగా కూటమి చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీతా కుమారి భారీ మెజార్టీతో గెలుపొందడంపై బీటెక్ రవి హర్షం వ్యక్తం చేశారు.ఈ చారిత్రాత్మక విజయానికి కారణమైన పులివెందుల ఓటర్లకు,అహర్నిశలు శ్రమించిన కూటమి కార్యకర్తలకు బీటెక్ రవి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ దశాబ్దాలుగా కొనసాగుతున్న కుటుంబ పాలనకు పులివెందుల ప్రజలు తమ ఓటు హక్కుతో చరమగీతం పాడారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే పట్టణంలో గత ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలను సరిదిద్దే పనులు ప్రారంభమయ్యాయని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి తీరుతామని భరోసా ఇచ్చారు.అనంతరం గెలుపొందిన కౌన్సిలర్లను, చైర్మన్ అభ్యర్థిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఫోర్జరీ లేఖతో బీసీలు రాచమల్లును నమ్మే పరిస్థితి లేదు

- టీడీపీ బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యత కల్పిస్తోంది



ప్రొద్దుటూరు మన జనప్రగతి నవంబర్ 03:-బీసీలకు రాజకీయంగా సముచిత గుర్తింపు, ప్రాధాన్యత కల్పించడంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుందని ఎమ్మెల్యే సంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. బీసీలకు వ్యతిరేకంగా తాను లేఖ రాశానంటూ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, ఆ లేఖతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ పదవిని బీసీలకు కాకుండా ఓసీలకు కేటాయించాలని తాను లేఖ రాసినట్లు చూపించడం దుర్మార్గమని, అది ఫోర్జరీ లేఖ అని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో 52 స్థానాలకు గాను 30 స్థానాలను బీసీలకు కేటాయించడం టీడీపీ బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. చైర్మన్ పదవి రొటేషన్ విధానంలో కేటాయిస్తారని వివరించారు.టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, కౌన్సిలర్ నరేంద్ర మాట్లాడుతూ రాచమల్లు ఆరోపణలను ఖండించారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సంద్యాల రాఘవరెడ్డి, కౌన్సిలర్లు సిద్ధయ్య, షేర్ అలీ, బీసీ నాయకులు చౌడం వెంకట కొండయ్య, గంజికుంట ఆంజనేయులు, కుతుబుద్దీన్, పోసా భాస్కర్, సోమా బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అదాలత్ మస్జిద్ భూమి జోలికొస్తే మరో ఉద్యమం తప్పదు!

● రవీందర్‌సింగ్ వ్యాఖ్యలు గంగుల చిలుక పలుకులే.. ముస్లింల మనోభావాలు దెబ్బతీయొద్దు ● ఎంఐఎం యువజన నాయకుడు మెరాజొద్దీన్ హెచ్చరిక



కరీంనగర్, మన జనప్రగతి నవంబర్ 03:- అదాలత్ మస్జిద్ వక్ఫ్ భూమి విషయంలో మాజీ మేయర్, బీఆర్ఎస్ కార్పొరేటర్ రవీందర్‌సింగ్ చేసిన వ్యాఖ్యలను ఎంఐఎం యువజన నాయకుడు మహమ్మద్ మెరాజొద్దీన్ తీవ్రంగా ఖండించారు. రవీందర్‌సింగ్ మాట్లాడుతున్న మాటలు ఆయన సొంతం కాదని, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చెప్పిన చిలుక పలుకులని విమర్శించారు. ముస్లిం సమాజం బీఆర్ఎస్‌కు ముగ్గురు కార్పొరేటర్లను గెలిపించి అండగా నిలిస్తే, అదే పార్టీకి చెందిన నాయకులు మస్జిద్ భూమి అంశాన్ని తెరపైకి తెచ్చి ముస్లింల మనోభావాలను దెబ్బతీయడం ఏమిటని ప్రశ్నించారు.ప్రజల పన్నులతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అదాలత్ మస్జిద్ భూమిని కొనుగోలు చేసిందంటూ రవీందర్‌సింగ్ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఆయన ఐదేళ్లు మేయర్‌గా పనిచేసిన సమయంలో ఈ విషయం ఎందుకు ప్రస్తావించలేదని నిలదీశారు. గెజిట్ ప్రకారం మార్కెట్‌కు సంబంధించిన రెండు ఎకరాలకు పైగా భూమి వక్ఫ్ బోర్డుకు చెందినదని పేర్కొన్నారు. ఈ అంశంపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా, ఇప్పుడు హఠాత్తుగా ఎందుకు ప్రస్తావిస్తున్నారని ప్రశ్నించారు.రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ లబ్ధి కోసం ఈ అంశాన్ని తెరపైకి తెస్తున్నారని మెరాజొద్దీన్ ఆరోపించారు. కరీంనగర్‌లో బీజేపీని బలోపేతం చేసేందుకు గంగుల కమలాకర్, రవీందర్‌సింగ్ కలిసి రాజకీయ నాటకానికి తెరతీశారని విమర్శించారు. గతంలో మేయర్‌గా, కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన రవీందర్‌సింగ్‌కు ఈ భూమి విషయం ఇప్పుడే గుర్తుకు రావడం వెనుక కారణమేంటని ప్రశ్నించారు.ఎమ్మెల్యే గంగుల వక్ఫ్ భూమి విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఇప్పుడు అదాలత్ మస్జిద్ భూమిపై రవీందర్‌సింగ్ కన్ను పడిందా అని మెరాజొద్దీన్ ప్రశ్నించారు. మస్జిద్ భూమి జోలికొస్తే సహించేది లేదని, కరీంనగర్ ముస్లిం సమాజాన్ని ఏకం చేసి మరో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ముస్లింల మనోభావాలను గౌరవించాలని, లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు.

వేములవాడ పట్టణ గ్రంథాలయాన్ని సందర్శించిన శేఖర్ సేనాపతి

- విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి: శేఖర్ సేనాపతి



రాజన్న సిరిసిల్ల జిల్లా, మన జనప్రగతి నవంబర్ 03:- యువచైతన్య దీపం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శేఖర్ సేనాపతి వేములవాడ పట్టణ గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ప్రాముఖ్యతను, విద్యార్థుల జీవితాల్లో పుస్తక పఠనం పోషించే పాత్రను వివరించారు.ఈ సందర్భంగా శేఖర్ సేనాపతి మాట్లాడుతూ.. గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు చదివే ప్రదేశాలు మాత్రమే కాకుండా, విద్యార్థుల జీవితాలకు వెలుగునిచ్చే జ్ఞాన భాండాగారాలని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటూ పుస్తక పఠనాన్ని తమ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. పుస్తకాలు జ్ఞానాన్ని అందించడమే కాకుండా, జీవితంలో సరైన మార్గంలో ముందుకు సాగేందుకు ప్రేరణనిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి చేతిలో పుస్తకం ఉంటే వారి భవిష్యత్తుకు విజయపథం ఏర్పడుతుందని పేర్కొన్నారు.గ్రంథాలయాల అభివృద్ధికి, విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.పుస్తకం మంచి నేస్తం.. గ్రంథాలయం బంగారు భవిష్యత్తుకు బాట అనే సందేశంతో యువచైతన్య దీపం ఫౌండేషన్ (2013) విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు.

కళల్లో ఒకరు.. క్రీడల్లో ఇద్దరూ.. సత్తా చాటిన కవలలు!

- చిత్రలేఖనంలో స్రాగ్వికి ప్రథమ బహుమతి.. వాలీబాల్‌లో విజేతగా పాఠశాల జట్టు



గంగాధర, మన జనప్రగతి నవంబర్ 03:- కరీంనగర్ జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో టీజీఎంఎస్ మోడల్ స్కూల్ గంగాధరకు చెందిన విద్యార్థిని రావుల స్రాగ్వి ప్రథమ బహుమతి సాధించింది. అదే విధంగా జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టులో స్రాగ్వితో పాటు ఆమె కవల సోదరి రావుల స్నిగ్ధ సభ్యురాలిగా ఉండటం విశేషం.కవల సోదరీమణులు కళలు, క్రీడల్లో ప్రతిభ చాటుకోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యతో పాటు కళలు, క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు స్రాగ్వి, స్నిగ్ధలను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



రైల్వే కోడూరు అభివృద్ధికి కృషి చేస్తా:అంబటి మురళి



ఓబులవారిపల్లి మన జనప్రగతి నవంబర్ 03:- రైల్వే కోడూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేయడమే తన లక్ష్యమని వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ అభ్యర్థి అంబటి మురళి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు.ఎన్నికల్లో గెలిస్తే స్థానిక బస్సు డిపోను ఆధునీకరించి, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. మురుగునీటి పారుదల సమస్యను పరిష్కరించడంతో పాటు దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయించి మౌలిక వసతులు మెరుగుపరుస్తానని హామీ ఇచ్చారు.ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తానని పేర్కొన్నారు. ప్రచారంలో తనకు సహకరిస్తున్న నాయకులు, కార్యకర్తలకు, మద్దతు ఇస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థిగా భాస్కర్ నామినేషన్



ఓబులవారిపల్లి మన జనప్రగతి నవంబర్ 03:- చిట్వేలు మండల ప్రాదేశిక నియోజకవర్గ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా భాస్కర్ నామినేషన్ దాఖలు చేశారు. ప్రజాసేవ, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలిచినట్లు ఆయన తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజల ఆశీస్సులు, మద్దతుతో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు.ఎన్నికల సంఘం తనకు ప్రెషర్ కుక్కర్ గుర్తు కేటాయించిందని, ఓటర్లు ఆ గుర్తుపై ఓటు వేసి తనకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

వర్షంలోనూ ఇంటింటి ప్రచారం నిర్వహించిన ఎంపీటీసీ అభ్యర్థిని సౌజన్య

- కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను కోరిన నాయకులు



ఓబులవారిపల్లి మన జనప్రగతి నవంబర్ 03:- ఓబులవారిపల్లి మండలం గోవిందంపల్లి పంచాయతీలో టీడీపీ కూటమి ఎంపీటీసీ అభ్యర్థిని సిరిగిరాజు సౌజన్య వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గొడుగు పట్టుకుని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలుసుకుని ఎంపీటీసీ అభ్యర్థిగా తనకు, జడ్పీటీసీ అభ్యర్థిని కీర్తి కవితకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.అలాగే ముక్కువారిపల్లి, తురకపల్లి తదితర గ్రామాల్లోనూ ఇంటింటి ప్రచారం నిర్వహించి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామాల్లోని ప్రజలను కలుసుకుని తమ అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో ఎర్రబాబు, మధుసూదన్ రెడ్డి, గడ్డం జంగల్ రాజు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ ఊర చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో అక్రమ గోడౌన్ కూల్చివేయాలి

● కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు బిజెపి నేతల ఫిర్యాదు



కరీంనగర్ మన జనప్రగతి నవంబర్ 03:- కరీంనగర్ నగర పాలక సంస్థ 17వ డివిజన్ పరిధిలోని ఊర చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన గోడౌన్‌ను వెంటనే కూల్చివేసి చెరువును పరిరక్షించాలని బిజెపి మాజీ పట్టణ అధ్యక్షుడు కేంచ శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం రోజున కరీంనగర్ కలెక్టరేట్‌తో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో కేంచ శేఖర్ , బిజెపి నాయకులతో కలసి కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్గం శ్రీనివాస్, సర్గం మల్లేశం, సర్గం రాజు అనే వ్యక్తులు మున్సిపల్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా, కొత్తపల్లి పరిధిలోని ఊర చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా గోడౌన్ నిర్మాణం చేపట్టారని తెలిపారు. గతంలో ఇరిగేషన్ అధికారుల సూచనల మేరకు మున్సిపల్ అధికారులు ఈ నిర్మాణంపై నోటీసులు ఇచ్చి, కేటాయించిన ఇంటి నంబర్‌ను కూడా రద్దు చేశారని గుర్తుచేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు గోడౌన్‌ను పూర్తిగా తొలగించలేదని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై కలెక్టర్, కమిషనర్ సానుకూలంగా స్పందించారని, ఆర్‌డీవో, ఇరిగేషన్ మున్సిపల్ అధికారులతో సమీక్షించి తక్షణమే ఆ అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తామని హామీ ఇచ్చారని కేంచ శేఖర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ముత్తునూరి హరీష్, జేరిపోతుల శ్రీకాంత్, దుబాయ్ సునీల్, ఎస్. రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయాల్లో జాగ్రత్తలు పాటించాలి

● వేంపల్లె తహసిల్దార్ శివ శంకర్ రెడ్డి



వేంపల్లె మన జన ప్రగతి నవంబర్ 03:-దీపావళి పండుగ సందర్భంగా టపాసుల విక్రయాల్లో వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలని తహ సిల్దార్ శివశంకర్ రెడ్డి అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం టపాసుల విక్రయాలపై పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, లైసెన్సుదారులతో ఆయన సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ప్రమాదాలు జరగని చోట స్థలంలో పెద్ద ఎత్తున ఇసుక తోలి అక్కడ విక్రయాలు జరపాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపాల్ నాయక్, ఆర్. ఐ లోకేష్ లైసెన్సుదారులు పాల్గొన్నారు.

చివరి రోజు జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ప్రచారం

- అరుంధతివాడలో కొరముట్లకు బ్రహ్మరథం



రైల్వేకోడూరు మన జనప్రగతి నవంబర్ 03:- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో రైల్వేకోడూరు పట్టణంలోని అరుంధతివాడలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థి అంబటి మురళి, ఎంపీటీసీ అభ్యర్థి కోడూరు లక్ష్మీబానుతో కలిసి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు రామిరెడ్డి ధ్వజారెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు.అరుంధతివాడలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసిన నాయకులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మందల నాగేంద్ర, ఎర్రతోట్టి బాబు, శారదమ్మ, అంజనేయులు, రత్తయ్య, డీవీ రమణ, ప్రసాద్, గిరివర్మతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు భారీగా పాల్గొన్నారు.

ముక్కావారిపల్లి,తురకపల్లిలో ముక్కా వరలక్ష్మి విస్తృత ప్రచారం



రైల్వేకోడూరు మన జనప్రగతి నవంబర్ 03:-ఓబులవారిపల్లి మండలంలోని ముక్కావారిపల్లి, తురకపల్లి గ్రామాల్లో జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఈ సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఓబులవారిపల్లి మండల జడ్పీటీసీ అభ్యర్థి కవితకు మద్దతుగా ఆమె గ్రామాల్లోని ప్రజలను, మహిళలను, స్థానిక ఓటర్లను నేరుగా కలుసుకున్నారు. కూటమి అభ్యర్థికి మద్దతు తెలిపి ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు. గ్రామాల్లోని ప్రజలతో మమేకమవుతూ వారి ఆదరాభిమానాలను కోరారు. జడ్పీటీసీ అభ్యర్థి కవితను గెలిపించేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ముక్కావారిపల్లి, తురకపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభ్యర్థి తరఫున ఓటర్లను కలుసుకుంటూ ప్రచారాన్ని కొనసాగించారు. ఆయా గ్రామాల్లో కూటమి శ్రేణులు పాల్గొనడంతో ఎన్నికల సందడి నెలకొంది.

అమీన్ పీర్ దర్గాకు రాజకీయాలతో
ఎలాంటి సంబంధం లేదు

● దర్గా ప్రతిష్టను దెబ్బతీసేలా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయొద్దు ● అమీన్ పీర్ దర్గా శిష్య బృందం

కడప మన జనప్రగతి నవంబర్ 03:కడప నగరంలోని ప్రముఖ అమీన్ పీర్ దర్గా కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతమైన ఆధ్యాత్మిక క్షేత్రమని దర్గా శిష్య బృందం స్పష్టం చేసింది. తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్, కాంగ్రెస్, బీజేపీతో పాటు ఇతర రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు సైతం దర్గాను సందర్శిస్తూ, తమకు తోచిన విధంగా సేవలు అందిస్తున్నారని పేర్కొంది. దర్గాకు అన్ని రాజకీయ పార్టీలతో పాటు అన్ని మతాల వారిని సమానంగా ఆహ్వానించడం ఆనవాయితీ అని తెలిపింది.నవంబర్ 1న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఉదయం సుమారు 8 గంటల సమయంలో దర్గాకు ఉన్న రెండు ప్రధాన ద్వారాలను మూసివేసి, ప్రార్థనల నిమిత్తం చిన్న ద్వారాన్ని మాత్రమే తెరిచి ఉంచినట్లు వివరించింది.అయితే ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో దర్గాకు చెందిన శిష్యుడు బషీర్‌ను ప్రస్తావిస్తూ, ఎన్నికల నేపథ్యంలో కొంతమంది వ్యక్తులకు దర్గాలో ఆశ్రయం కల్పించారని, దర్గాను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.ఈ ప్రచారంలో దర్గా పీఠాధిపతి ప్రమేయం ఉందంటూ అనుమానాలు వ్యక్తం చేయడం పూర్తిగా అవాస్తవమని పేర్కొంది. ఇటువంటి ప్రచారాలకు దర్గా పీఠాధిపతికి గానీ, దర్గా మేనేజ్‌మెంట్‌కు గానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది.అమీన్ పీర్ దర్గా పవిత్రతను, ప్రతిష్టను దెబ్బతీసే విధంగా నిరాధార ఆరోపణలు, అసత్య పోస్టులు పెట్టడం తగదని హితవు పలికింది. ఇలాంటి తప్పుడు ప్రచారాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరింది.అవసరమైతే బాధ్యులపై పరువునష్టం దావా కూడా వేస్తామని అమీన్ పీర్ దర్గా శిష్య బృందం హెచ్చరించింది.

జగన్ ఆధిపత్యానికి కూటమి అడ్డుకట్ట

భారీ మెజార్టీతో టిడిపి చైర్మన్ అభ్యర్థి విజయం
అదే జోరు కొనసాగించిన కౌన్సిలర్ అభ్యర్థులు



కడప మన జనప్రగతి నవంబర్ 03:వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆధిపత్యానికి ఆనవాళ్లుగా నిలిచిన పులివెందుల మున్సిపాలిటీలో టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి ఆధ్వర్యంలో జగన్ హవాకు అడ్డుకట్ట పడగా, పులివెందుల పురపాలక చైర్పర్సన్ గా పోటీ చేసిన గీతా కుమారి సమీప ప్రత్యర్థి ప్రమీలమ్మ పై 138 75 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించగా నిలిచిన మిగిలిన కౌన్సిలర్లు కూడా అధిక మొత్తంలో విజయ బావుటా ఎగురవేశారు.శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లకు మరియు మున్సిపాలిటీ లకు నిర్వహించినటువంటి ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుండి కూటమి ప్రభుత్వం అనేక మున్సిపాలిటీలను సొంతం చేసుకోగా అదే తరహాలో పులివెందుల మున్సిపల్ చైర్ పర్సన్ పీఠాన్ని తెలుగుదేశం పార్టీ తన ఖాతాలో వేసుకుంది.ఎన్నికల అధికారులు తెలిపినటువంటి వివరాల మేరకు పులివెందుల మున్సిపాలిటీలో పర్సన్ గా పోటీ చేసినటువంటి తూగుట్ల గీతా కుమారి మొదటి రౌండ్లో స్వల్ప తేడాతో ముందంజలో కొనసాగగా రెండవ ,మూడవ రెండు నందు భారీ ఆధిక్యంలో కొనసాగారు. మొత్తం మీద 25434 ఓట్లు గీత కుమారికి పోలవగా వైఎస్సార్సీపీ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రమీలమ్మకు 11559 ఓట్లు పోలవ్వగా 13875 ఓట్ల మెజారిటీతో గీతా కుమారి విజయం సాధించారు అదే తరహాలోనే బీదవార్డులకు సంబంధించి 28వ వార్డు టిడిపి అభ్యర్థి వెంకట సాయి కిషోర్ 213 ఓట్ల మెజారి టీ, 33వ వార్డు తూగుట్ల మధుసూదన్ రెడ్డి 593 ఓట్ల మెజారిటీ, 27వ వార్డు చలమ హైమావతి 524 ఓట్ల మెజారిటీ, 23వ వార్డు కమలమ్మ 593 మెజారిటీ, 31 వ వార్డు సాతుపాటి శ్రీనివాసులు 620 ఓట్ల మెజారిటీ, 39 వ వార్డు అనిత 731 ఓట్ల మెజారిటీ, 20వ వార్డులో మునివర్ధన్ 378 ఓట్ల మెజారిటీ,26వ వార్డు లక్ష్మీదేవి 275 ఓట్ల మెజారిటీతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించగా,వైకాపాకు సంబంధిం చి మున్సిపల్ ఇంచార్జ్ మనోహర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మరియు పార్నపల్లె ఝాన్సీ వైకాపా తరఫున విజయం సాధించారు. సుదీర్ఘకాలంగా వైఎస్ కుటుంబానికి రాజకీయ అండదండలు అందించిన పులివెందులలో వైఎస్ ప్రమీలమ్మ పోటీలో ఉన్నప్పటికీ ఫలితాలు కూట మి ప్రభుత్వానికి అనుకూలంగా రావడం పట్ల రాజకీయ విశ్లేషకులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తుండగా కూటమి నా యకులలో కార్యకర్తలలో నూతన ఉత్తేజాన్ని నింపాయి.

పులివెందులలో చరిత్ర సృష్టించిన టీడీపీ

● మున్సిపాలిటీ కైవసం..! ● వైసీపీ కంచుకోటలో కూటమి జెండా

● 40 వార్డుల్లో 37 స్థానాల్లో విజయం



పులివెందుల మన జనప్రగతి నవంబర్ 03:- వైఎస్సార్ కుటుంబానికి రాజకీయంగా పట్టున్న పులివెందుల మున్సిపాలిటీలో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి చారిత్రాత్మక విజయం సాధించింది. మున్సిపాలిటీని కైవసం చేసుకోవడంతో పాటు మొత్తం 40 వార్డుల్లో 37 స్థానాలను గెలుచుకుంది.2005లో 26 వార్డులతో పులివెందుల మున్సిపాలిటీ ఏర్పడింది. అప్పట్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన రుక్మిణీ దేవి తొలి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2014లో వైసీపీకి చెందిన వైఎస్ ప్రమీలమ్మ, 2021లో వర ప్రసాద్ చైర్మన్లుగా బాధ్యతలు నిర్వహించారు.తాజా మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడంతో పులివెందుల రాజకీయాల్లో కీలక మార్పు చోటుచేసుకుంది. అంతేకాకుండా జిల్లాలో 3 జడ్పీటీసీ, 64 ఎంపీటీసీ స్థానాలను సైతం కూటమి గెలుచుకున్నట్లు సమాచారం.

పులివెందులలో ఎన్నికల అనంతరం పటిష్ట నిఘా

- శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల అవగాహన ప్రచారం



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 03:- మునిసిపల్ ఎన్నికల ముగింపు నేపథ్యంలో వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు.జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్,ఐపీఎస్ ఆదేశాల మేరకు పులివెందుల అర్బన్ సీఐ పురుషోత్తం రాజు పర్యవేక్షణలో పోలీసులు పట్టణంలో మైక్ ద్వారా ముమ్మర అవగాహన ప్రచారం నిర్వహించారు. ప్రస్తుతం పట్టణంలో పోలీస్ యాక్ట్ సెక్షన్ 30,భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 అమలులో ఉన్నాయని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎన్నికల ఫలితాల నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలు,ఊరేగింపులు,బహిరంగ సభలు,సమావేశాల నిర్వహణపై పూర్తి నిషేధం విధించారు.బాణసంచా కాల్చడం,రెచ్చగొట్టే నినాదాలు చేయడం,ఇతర పార్టీల నాయకులు లేదా శ్రేణులను కించపరిచేలా వ్యవహరించడం నేరమని రాజకీయ పార్టీల కార్యకర్తలు,అభిమానులు పరస్పర ఘర్షణలకు తావిచ్చేలా ప్రవర్తించరాదని సామాజిక మాధ్యమాలలో విద్వేషపూరిత పోస్టులు,అసత్య ప్రచారాలు,రెచ్చగొట్టే సందేశాలను వ్యాప్తి చేస్తే సైబర్ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తారని గత వివాదాలను ప్రస్తావిస్తూ ఎవరైనా ఘర్షణలకు దిగితే ఉపేక్షించేది లేదన్నారు.పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలంతా సహకరించాలని ఏదైనా అనుమానాస్పద కదలికలు కనిపించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉన్నా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని,అత్యవసర సమయాల్లో డయల్ 112కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.ఎన్నికల ప్రక్రియ



ముగిసినప్పటికీ పట్టణంలో పోలీసు పహారా,పటిష్ట బందోబస్తు కొనసాగుతుందని అర్బన్ సీఐ పురుషోత్తమ రాజు స్పష్టం చేశారు. పౌరులంతా సంయమనం పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు విభాగానికి పూర్తి సహకారం అందించాలని జిల్లా పోలీసు కార్యాలయం కోరింది.

నిమోనియా ద్వారా సంబవించే శిశు మరణాలు అరికట్టాలి: డాక్టర్ గవాస్కర్ రెడ్డి



తొండూరు మన జనప్రగతి నవంబర్ 03:-మండల పరిధిలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ గవాస్కర్ రెడ్డి ఆధ్వర్యం లో ఆశాడే కార్యక్రమము నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు పిల్లలలో వచ్చే నిమో నియా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు తెలియచేసి వ్యాధి ముందుగానే గుర్తించి నిమోనియా ద్వారా సంబవించే మరణాలను అరికట్టాలని ఇంటింటి దర్శనాల ద్వారా నెలలోపు పిల్లలు మరియు 5 సంవత్సరాల లోపు పిల్లల సంరక్షణకు, బాలింత సంరక్షణకు అత్యంత ప్రాధన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఇంటింటి దర్శనాలు చేయాలని వారు తెలిపారు. బ్రిక్స్ సుస్థిర జీవన శైలి వారోత్సవాల సందర్భంగా నీటి వనరుల అవసరతలు,వాటి ప్రా ధాన్యత,నీటి వృధా ద్వారా భావితరాలకు జరిగే నష్టం గురించీ, వారము లో చేయవలసిన కార్యక్రమాల గురించీ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మల్లయ్య అవగాహన కల్గించి ప్రతిజ్ఞ చేయించారు. కమ్యూనిటీ ఆరోగ్య అధికారిని విజయ, హెల్త్ సూపర్ వైసర్ షీభా రాణి,మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో నవంబర్ 5న స్థానిక సెలవు

- జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి.



కర్నూలు బ్యూరో మన జనప్రగతి నవంబర్ 03: ఎంపీటీసీ, జెడ్పిటిసి, ఎన్నికల పోలింగ్ జరిగే ప్రాంతాల్లో నవంబర్ 5న స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు వీలుగా పోలింగ్ రోజైన నవంబర్ 5న స్థానిక సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సెలవు ఎన్నికల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు వర్తిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్, 1881 ప్రకారం కూడా పోలింగ్ రోజున సెలవు వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాలుగా వినియోగిస్తున్న ప్రభుత్వ, విద్యాసంస్థల భవనాలు మరియు ఇతర భవనాలకు నవంబర్ 4 (పోలింగ్ ముందు రోజు), నవంబర్ 5 (పోలింగ్ రోజు), నవంబర్ 7 (కౌంటింగ్ రోజు) సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని, ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు బంగారు పథకాలు



వేంపల్లె మన జన ప్రగతి నవంబర్ 03:-రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో త్రిబుల్ ఐటీ విద్యార్థులు పాల్గొని 13 స్వర్ణ పథకాలు, 4 రజత పథకాలు,5 కాంష పథకాలు సాధించారు.అంతేకాకుండా,ఆర్‌కే వ్యాలీ పవర్ లిఫ్టింగ్ జట్టు జూనియర్ బాలికల విభాగంలో టీమ్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకోగా,సబ్ జూనియర్ బాలికల విభాగంలో టీమ్ ఛాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం సాధించింది.కాగా కళాశాలకు చెందిన ఎం.రాఘవేంద్ర రాష్ట్ర స్థాయి జూనియర్ స్ట్రాంగ్‌మన్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించి విశ్వవిద్యాలయానికి మరింత గుర్తింపు తీసుకువచ్చారు.ఈ విద్యార్థుల పట్ల డైరెక్టర్ ఆచార్య గడ్డం విజయ ప్రకాష్, కోచ్, ఫిజిక్స్ అధ్యాపకుడు డాక్టర్ బాల గోవింద్ తివారి హర్షం వ్యక్తం చేశారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174